క్లుప్తంగా

స్తంభాన్ని తొలగించిన అధికారులు



గోవిందరావుపేట: మండలలోని చల్వాయి గ్రామంలో బస్టాండ్ ఆవరణలో సోలార్ లైట్ స్తంభానికి అర ఫీట్ గ్యాప్‌తో త్రీఫేజ్ కరెంట్ వైర్లు ప్రమాదకరంగా ఉండడంతో 'పొంచి ఉన్న ప్రమాదం' అనే కథనాన్ని బుధవారం సాక్షిలో ప్రచురితమైంది. కథనానికి స్పందించి సంబంధిత అధికారులు వెంటనే అక్కడి నుంచి సోలార్ లైట్ల స్తంభాన్ని జేసీబీ సహాయంతో తొలగించారు. దీంతో ఈ పరిసరాల్లో తిరిగే ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వాజేడు : రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 30, 31 రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లను విడిచి బయటకు రావద్దని సూచించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల కార్యదర్శులను ఇప్పటికే అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు.

గణపతి నవరాత్రులకు ఏర్పాట్లు



వాజేడు : మండల కేంద్రంలో గణపతి నవరాత్రులు జరిపించడానికి సిద్ధివినాయక కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను చేపట్టారు. అందులో భాగంగా బుధవారం చలువ పందిళ్లను వేయడం కోసం పాక శంకుస్థాపన చేశారు. సెప్టెంబర్ 7 నుంచి నిర్వహించ తలపెట్టిన నవరాత్రుల కోసం కమిటీ సభ్యులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

గిరిజన గ్రామ కమిటీ ఎన్నిక



ఏటూర్‌నాగారం : ఐటీడీఏ పరిధిలోని ఆకుల వారి గణపురం గిరిజన గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గిరిజన తెగలు అయిన కోయ, నాయకపోడు, ఎరుకల, లంబాడి స్థానిక గిరిజనులతో కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా గండేపల్లి సత్యం, ఉపాధ్యక్షుడిగా జగన్నాథం, నాగసాగర్, బలరాం నాయక్, మహాలక్ష్మీ, లావణ్య, ప్రధాన కార్యదర్శిగా సరిత, నాగమణి, గంగా, ప్రచార కార్యదర్శిగా రమేశ్, భరత్, రాజు, కోశాధికారిగా కల్యాణ్, రాధిక, గౌరవ సలహాదారుగా రాంమూర్తి, సభ్యులుగా సమ్మయ్య, రాజు, కిరణ్, నవీన్, ప్రవీణ్, హరీష్ తదితరులు ఎన్నికయ్యారు.

టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా స్వామి



ములుగు రూరల్: టీపీటీఎఫ్ ములుగు మండల అధ్యక్షుడిగా మండలంలోని బందారుపల్లికి చెందిన వైనాల స్వామిని నియమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందించారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా సబ్బాని రవీందర్, పోరిక రఘురాం, బానోత్ భద్రు, ప్రధాన కార్యదర్శిగా ఉప్పస్వామి, కార్యదర్శులుగా రమేష్, కేదారి, రతన్‌కుమార్, ఆడిట్ కన్వీనర్‌గా భూక్య గోపిసింగ్, మంకిడి శ్రీనివాస్‌లను నియమించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం ఎళ్లవేళలా కట్టుబడి ఉంటుందని అన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- పేరూరు, చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు రాహిల్, యమున
- నర్సింహాసాగర్, అయ్యవారిపేటలో వైద్యశిబిరం

వాజేడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు వైద్యాధికారి రాహిల్ అన్నారు. మండలంలోని అయ్యవారిపేట గ్రామంలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించి మందులను అందజేశారు. జ్వరం, దగ్గు, జలుబు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. జ్వరాల తీవ్రత ఎక్కువ కాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. రోగులను పరీక్షించడంతో పాటు జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ముగ్గురికి జ్వరం ఉన్నట్లు వెల్లడించారు. ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం అన్నారు.



మంగపేట: రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్‌లో చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నపల్లి యమున ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 59 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అదే విధంగా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారు పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలతో పాటు రోజువారిగా తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై పలు సూచనలు చేసి వారికి అవసరమైన మందులనుపంపిణీ చేశారు. ఆరుగురు జ్వర పీడితులకు మలేరియా రక్త పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ రిపోర్టు రావడంతో మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల గురించి, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి వ్యాధులు సంక్రమించకుండా ఉండేందుకు ప్రతీ ఒక్కరు కాచి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎం సారమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వాజేడు : వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

ఇసుక దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మంగపేట: మండంలో యథేచ్ఛగా కొనసాగుతున్న ఇసుక దోపిడీని అరికట్టాలని బీఆర్‌ఎస్ మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీ నారాయణ, పలువురు జిల్లా నాయకులు మాట్లాడుతూ మండలంలో గిరిజన ఇసుక సొసైటీలను అడ్డుపెట్టుకుని రైజింగ్ కాంట్రాక్టర్లు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి టీజీఎస్‌ఎండీసీ అధికారులతో కుమ్మక్కై అక్రమ ఇసుక రవాణాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని వారు మండిపడ్డారు. ఇసుక క్వారీలకు వచ్చే లారీలకు ప్రత్యేక ప్రార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయకుండా రోడ్లపై కిలోమీటర్ల మేర నిలిపివేస్తూ ప్రయాణికులు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రోడ్లపై లారీలను నిలిపి వేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో పాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. లారీల కారణంగా ఏటూరునాగారం–బార్గంపాడు ప్రధాన రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు నిద్రపోతున్నారా అని వారు ప్రశ్నించారు. అధికారులు మామూళ్ల మత్తులో తూగుతుంటే తమను అడిగే వారు లేరనే ధీమాతో ఇసుక కాంట్రాక్టర్లు ఒక్కఅదనపు బకెట్‌కు రూ.2000, లోడింగ్ చార్జి, సీరియల్, పొక్లెన్ ఆపరేటర్‌కు రూ.500 చొప్పున అక్రమంగా వసూలు చేసి లక్షల రూపాయలను దోపిడీకి పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. అంతే కాకుండా వేబిల్లు పర్మిషన్ లేకుండా సొంత టిప్పర్లతో జీరో దందా కొనసాగిస్తున్నారన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్లపై ఇసుక లారీలను నిలుపకుండా చర్యలు తీసుకోవాలని క్వారీలలో అదనపు బకెట్ల దందాను అరికట్టాలని క్వారీ యజమానులకు సహకరిస్తున్న టీజీఎండీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ఇసుక క్వారీల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు తాటి కృష్ణ, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, మండల, జిల్లా నాయకులు రాజుయాదవ్, యడ్లపెల్లి నర్సింహారావు, కోరెం సంతోష్, నూనె లింగయ్య, సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు, గుడివాడ శ్రీహరి, కొమరం రాంమ్మూర్తి మరో 20 మంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై

ఎస్‌ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి–చిన్నబోయినపల్లి మధ్య అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై కాలుకు గాయంతో పడి ఉన్న మతిస్థిమితం లేని వృద్ధురాలిని స్థానిక ఎస్సై ననిగంటి శ్రీకాంత్‌రెడ్డి వైద్య చికిత్సలు అందించి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం రాత్రి ఎస్సై, కానిస్టేబుళ్లు పూజారి రమేశ్, సాంబయ్యలతో పెట్రోలింగ్‌కు వెళ్లారు. చిన్నబోయినపల్లి–తాడ్వాయి మధ్యలోని చింతలమోరి గొత్తికోయగూడెం సమీపంలోని అడవిలో ఒక కల్వర్టు వద్ద రోడ్డుపై వెళ్లే ఇసుక లారీలకు అడ్డంగా ప్రమాదకర పరిస్థితిలో కాలికి గాయంతో పడి ఉన్న వృద్ధురాలిని గుర్తించి దగ్గరకు వెళ్లి పలకరించి ఆరా తీశారు. ఆమె గత కొన్నేళ్లుగా చిన్నబోయినపల్లిలో ఉంటుందని తెలియడంతో ఎస్సై సిబ్బందితో వాహనంలో గ్రామానికి తీసుకొచ్చారు. ఆర్‌ఎంపీ వైద్యుడితో వృద్ధురాలికి వైద్య చికిత్స చేయించి భోజనం పెట్టించారు. వృద్ధాశ్రమానికి పంపించడం కోసం వృద్ధురాలితో మాట్లాడగా తాను చిన్నబోయినపల్లిలోనే ఉంటానని చెప్పింది. వృద్ధురాలిని చేరదీసి మానవత్వాన్ని చాటుకున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.



వృద్ధురాలికి చికిత్స చేయిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఆర్థికసాయం

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి జిల్లా పరిషత్ , కేజీబీవీ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఆర్థికసాయాన్ని బయోస్టాడ్ ఇండియన్ ప్రైవేట్ కంపెనీ వారు ఆర్థిక సాయం అందజేశారు. పదో తరగతి చదువుకుంటున్న 15 మంది విద్యార్థులకు ఒక్కరికి రూ.2500 చొప్పున 3,7500 స్కాలర్‌షిప్‌గా వారికి స్థానిక ఫర్టిలైజర్ షాపు యజమానుల ఆధ్వర్యంలో కంపెనీ మేనేజర్ లక్ష్మణ్ అందించారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రతీ ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పట్టుదలతో చదివితే ఫలితాల పంటలు పండుతాయన్నారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ యజమానులు అబ్బు సతీష్, చిట్టెం శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, అశ్విని, గ్రామ పెద్దలు సుమణ రాజబాబు, గంగరాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు

'దళితుల భూముల్లో నుంచి రోడ్డు వేయొద్దు'

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం శివారులో జాతీయ రహదారి కోసం సర్వే చేసిన దళితుల భూముల్లో నుంచి రోడ్డు వేయొద్దదని, ముక్తివనం పార్కు మీదుగా, పూర్వపు రోడ్డు గుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం వారు గతంలో రోడ్డు సర్వేను అడ్డుకున్నామని, మళ్లీ సర్వే చేస్తున్నారని, మా భూముల గుండా రోడ్డు నిర్మాణం మానుకోవాలని రేవెల్లి ఊశాలు తదితర రైతులు కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- యువత మత్తుకు దూరంగా ఉండాలి
- సైబర్ నేరాలపై అవగాహన అవసరం
- మహదేవపూర్ సీఐ రామచంద్రరావు

కాళేశ్వరం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని, యువత మత్తుకు అలవాటు పడొద్దని మహదేవపూర్ సీఐ రామచంద్రరావు అన్నారు. బుధవారం ఆయన కాళేశ్వరం పోలీసుస్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. బెల్టు, గుడుంబా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక నుంచి నిత్యం పెట్రోలింగ్ చేస్తామన్నారు. త్వరలో సీసీ కెమెరాల ఏర్పాటు, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న కెమెరాలను మరమ్మతులు చేస్తున్నామని పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌లో తెలియని వాటికి స్పందించద్దని పేర్కొన్నారు. ఒక వేళ డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్‌తో ఆడి డబ్బులు పోగొట్టుకొని ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దన్నారు. యువత బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాల వివరాలు తెలిస్తే నేరుగా చెప్పాలన్నారు. చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపించిన వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఏదైనా ఆపద వచ్చిన, ఘర్షణలు జరుగుతున్న వెంటనే డయల్ 100కు గాని, పోలీసులకు సమాచారం తెలుపాలన్నారు.

సుమన్‌కు మదర్‌థెరిస్సా జాతీయ సేవా పురస్కారం



అవార్డు అందుకుంటున్న సుమన్

వరంగల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు గజ్జెల సుమన్‌కు మదర్‌థెరిస్సా జాతీయ సేవా పురస్కారాన్ని మదర్ సర్వీస్ సొసైటీ ఫౌండర్ మల్లాది ప్రసాదరావు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ దాసు, మనం ఫౌండేషన్ ఫౌండర్ చక్రవర్తి, హెల్ప్ ఫౌండేషన్ (సత్తనపల్లి) వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అందజేశారు. విజయవాడ హనుమంతరాయ పౌర గ్రంథాలయంలో మదర్ సర్వీస్ సొసైటీ రెండు వార్షికోత్సవాలు మంగళవారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సాతో పాటు ఇతర రాష్ట్రాల్లో కళా, సాంస్కృతిక, సేవా రంగాల్లో కృషి చేస్తున్న వారిని గుర్తించి వివిధ పురస్కారాలు ప్రదానం చేసి సన్మానించారు. ములుగు జిల్లా ఏటూరునాగారం పట్టణానికి చెందిన సుమన్ వృత్తిరీత్యా హనుమకొండలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ రక్తదాతగా, మోటివేటర్‌గా, యువ నేతాజీ ఫౌండేషన్ ప్రధాన సభ్యుడిగా సుమన్ కొనసాగుతున్నారు. సుమన్‌ను పలువురు అభినందించారు.

నిఘా నీడలో పోలీస్‌స్టేషన్

టేకుమట్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే, డీఎస్పీ సంపత్‌రావు ఆదేశాల మేరకు బుధవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు. సీసీ కెమెరాల పనితీరును సిబ్బందితో కలిసి మానిటర్‌లో వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సైతం 4 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి కదలికలను గుర్తించేందుకు, వారి ప్రవర్తనను తెలుసుకునేందుకు ఉపయోగపడనున్నట్లు తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్సై ప్రసాద్

అప్రమత్తతతోనే ప్రాణరక్షణ

- పొలం పనులకు శ్రీకారం చుట్టిన రైతులు
- ట్రాక్టర్ల వినియోగం, విద్యుత్ మరమ్మతుల్లో జాగ్రత్త

మొగుళ్లపల్లి : రైతులు పొలం పనులకు శ్రీకారం చుట్టారు. రైతులు, వ్యవసాయ కూలీలు, దినసరి రైతు కూలీలు పొలంబాట పడుతున్నారు. అయితే పనుల్లో నిమగ్నమై చుట్టూ ఉన్న పరిసరాలను మరిచిపోతుంటారు. విషపు పురుగులు సంచారం వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది. మరోవైపు విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. వ్యవసాయ పనులకు ఉపయోగించే వాహనాలను నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఏటా వానాకాలంలో చిన్నచిన్న పొరపాట్లు, ఏమరపాటుతో విద్యుత్, ట్రాక్టర్ ప్రమాదాలు జరగడం, పాము కాటుతో రైతులు, కూలీలు చనిపోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సాగు నేపథ్యంలో వ్యవసాయాధికారులు పలు సూచనలు ఇస్తున్నారు.

పెరిగిన ట్రాక్టర్ల వినియోగం

మండలంలో వర్షాకాలం పనులు ఊపందుకున్నాయి. రైతులు దుక్కులు దున్నడం, కల్టివేటర్ కొట్టడం, విత్తనాల సాళ్లు పెట్టడం తదితర పనులన్నీ ట్రాక్టర్లతోనే చేయిస్తున్నారు. వ్యవసాయ రంగంలో వీటి వినియోగం పెరిగింది. గతంలో రైతులు ఎద్దులు, నాగలి ఉపయోగించేవారు. ఈ క్రమంలో యంత్రాల వినియోగంలో అనుభవరాహిత్యమో, అజాగ్రత్తతోనో ప్రమాదాల బారిన పడుతున్నారు.

పాముకాటుతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు

వర్షాకాలంలో ఎక్కువ మంది రైతులు పాము కాటుకు గురవుతుంటారు. దీనికి మందులు ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. రాత్రి సమయాల్లో వ్యవసాయ పనులకు వెళ్లేవారు తమవెంట టార్చిలైట్ తీసుకెళ్లాలి.

- కాళ్లకు బూట్లు లేదా కాలుపైభాగం వరకు కప్పి ఉంచే చెప్పులు ధరించాలి. చేతిలో కర్ర పట్టుకొని శబ్దం చేసుకుంటూ వెళ్లాలి.
- పాముకాటు వేస్తే భయపడకుండా ధైర్యంగా ఉండాలి.
- పాముకాటు వేసిన ప్రాంతంలో గట్టిగా తాడుతో గాని, చేతి రుమాలుతో గానీ గట్టిగా కట్టుకోవాలి. అనంతరం బాధితులను ఆస్పత్రికి తీసుకువెళ్లాలి...

విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలంలో రైతులు, ప్రజలు విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి. ఇళ్ల, పొలాల వద్ద విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి.

- విద్యుత్ మరమ్మతుల సమయంలో టెస్టర్ వినియోగించాలి..
- వర్షం పడితే మోటార్లు తడవకుండా చూసుకోవాలి.

ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి...

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మోటార్లు, స్టార్టర్లు చుట్టూ పిచ్చిమొక్కలు పొదలు ఉంటే తొలగించాలి. స్టార్టర్లు పొడి ప్రదేశంలో మాత్రమే అమర్చుకోవాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలను, స్విచ్‌లను తాకొద్దు...



పొలం దున్నడానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

సూచనలు, సలహాలు ఇవ్వాలి



రైతులకు సరైన అవగాహన లేక ప్రమాదాలకు గురవుతున్నాము. అధికారులు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తుండాలి. ప్రస్తుతానికి తగిన జాగ్రత్తలు తీసుకుని ఖరీఫ్ పనులు నిర్వహించుకుంటాం.

– వీరమల్లు రైతు

మైనర్లకు ట్రాక్టర్లు ఇవ్వొద్దు



రైతులు వర్షాకాలంలో అనేక ప్రమాదాలకు గురవుతుంటారు. మైనర్లకు ట్రాక్టర్లు ఇవ్వొద్దు.అనుభవం కలిగిన డ్రైవర్లతోనే పొలం పనులు చేయించుకోవాలి.

– సురేందర్‌రెడ్డి, ఏఓ మొగుళ్లపల్లి

నిరుద్యోగ మహిళలకు ఉపాధి శిక్షణ

- ఎస్‌బీఐ ఆర్‌సీటీ సహకారంతో చేయూత
- వృత్తి విద్యపై మహిళలు, యువత మక్కువ
- సేవే మా లక్ష్యం..
- దేవాలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయిబాబా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ఆర్‌సీటీ డైరెక్టర్ బావరవి సహకారంతో నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధిపై ఇస్తున్న శిక్షణ కార్యక్రమం విజయవంతంగా 15 రోజులకు చేరుకుంది. ఈ శిక్షణలో మహిళలకు, యువతులకు మగ్గం వర్క్స్, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇవ్వడంతో మండలంలోని పలు గ్రామాల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే 2 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ కేంద్రాన్ని పలువురు అధికారులు కూడా, పర్యవేక్షించి శిక్షణ పొందుతున్న మహిళలకు అండగా నిలుస్తున్నారు. మహిళలు ఇప్పటి వరకు నేర్చుకుంటున్న శిక్షణను సందర్భంగా జరుగుతున్న సమావేశాల్లో అధికారులకు విశ్లేషించి చెబుతూ వారి మన్ననలను పొందుతున్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం బ్యూటీపార్లర్, సెల్ రిపేరింగ్‌లతో పలు రకాల వృత్తివిద్య శిక్షణలను అందరి సహకారంతో త్వరలోనే ఆలయ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు, మహిళలకు శిక్షణలు ఇవ్వడం వల్ల వారు ఆర్థికంగా అభివృద్ధి పొందుతారని, సహకరిస్తున్న వారికి కమిటీ నుంచి కృతజ్ఞతలు చెబుతున్నామని తెలిపారు. సేవ చేసి వారిని ఒక స్థానంలో, ఉపాధిలో ముందుకు కొనసాగాలని అన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బాధ్యతలు తీసుకున్న అనంతరం చేపట్టిన ప్రతి పనికి కమిటీ సభ్యులు పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు.



శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులు

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

వెంకటాపురం (కె): సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఏజెన్సీలో వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి వైద్యశిబిరాలు నిర్వహించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో డెంగీ, మలేరియా, విష జ్వరాలు పట్టి పీడిస్తున్నాయని, ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన చికిత్స అందడం లేదన్నారు. మండలంలోని రాచపల్లి, మల్లాపురం, సీతారాంపురం, ముత్తారం, రామచంద్రాపురం గ్రామాల్లో విష జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో నిత్యం వైద్య శిబిరాలు నిర్వహించాలని, వారంలో మూడు రోజులు గ్రామాల్లో ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తుర్స కృష్ణబాబు, తాటి రాంబాబు, బొగ్గుల గోపి, కుంజ సతీష్, బాడిష కన్నయ్య, మిడియం ముత్తయ్య, శంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పర్శిక సతీశ్

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



యాదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట: మండలంలోని కోటగడ్డ గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షుడు దాసరి సుధాకర్ అనారోగ్యంతో బాధపడుతుండగా బుధవారం మంత్రి సీతక్క పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన బండ యాదిరెడ్డి ఇటీవలె మరణించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె వెంట కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

'హైడ్రా మండలాలకు విస్తరించాలి'

కాళేశ్వరం: హైడ్రా ఒక హైదరబాద్‌లోనే కాకుండా మండలాలకు విస్తరింపజేయాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తున్న భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కబ్జాదారులపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు.